
andhrajyothy.com శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.3 । కనిష్ఠం 23.7

ఆంధ్రజ్యోతి

ఆదిలాబాద్ జిల్లా వార్తలు

5

ఆదివారం 29 సెప్టెంబరు 2024





● గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పంపిణీ చేసిన బతుకమ్మ చీరలు



● బతుకమ్మలతో మహిళలు (ఫైల్)

'బతుకమ్మ' చీరలు.. లేనట్టేనా!?

- పండుగ సమీపిస్తున్నా.. పంపిణీపై ఊసెత్తని ప్రభుత్వం
- గతేడాది మిగిలిపోయిన చీరలు ఐటీడీఏ పరిధిలోని మహిళా సంఘాలకు..
- మిగితా వారికి నగదును అందించే యోచనలో సర్కారు
- అక్టోబరు 2 నుంచి ప్రారంభంకానున్న సంబరాలు
- ప్రభుత్వ నిర్ణయంపై మహిళల ఎదురుచూపులు



ఆదిలాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ పండుగకు ఆడపడుచులకు అందించే బతుకమ్మ చీరల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతను ఇవ్వడం లేదు. దీంతో ఈసారి బతుకమ్మ చీరల పంపిణీ లేనట్లేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆడపడుచులకు బతుకమ్మ పండుగ కానుకగా చీరలను అందించారు. ఈసారి మాత్రం బతుకమ్మ చీరల పంపిణీపై ప్రభుత్వం ఊసెత్తక పోవడంతో మహిళల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పండుగ దగ్గర పడుతున్న కొద్ది మహిళలు బతుకమ్మ చీరల పంపిణీపై చర్చించుకోవడం కనిపిస్తోంది. అక్టోబరు 2నుంచి రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు ప్రారంభంకానున్నాయి. అయినా ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు అందలేదని అధికారులు చెబుతున్నా రు. గతంలో పండుగకు నెల రోజుల ముందే ప్రభుత్వం జిల్లాకు చీరలను సరఫరా చేసేది. దీంతో మండలాల వారీగా అర్హులైన మహిళల జాబితాలను అధికారులు సిద్ధం చేసేవారు. ఈసారి అలాంటి పరిస్థితులు లేకపోవడంతో అధికారుల్లో హడావుడి కనిపించడం లేదు. గతేడు జిల్లాకు ప్రభుత్వం 2లక్షల 37వేల చీరలను పంపిణీ చేయగా.. 5,910 చీరలు మిగిలిపోయినట్లు అధికారుల లెక్కల ప్రకారం తెలుస్తుంది. బతుకమ్మ చీరల పంపిణీపై గతంలోనూ భిన్నాభిప్రాయా లు వ్యక్తమైనా.. ప్రభుత్వం మాత్రం పంపిణీకే మొగ్గు చూపింది. దీంతో ఎందరో మందికి ఉపాధి అవకాశాలు కూడా కలిగాయి. అయితే కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పంపిణీకి ఇంకా గ్రీన్ సిగ్నల్ ఇవ్వక పోవడం అయోమయ పరిస్థితులకు దారి తీస్తోంది.

ఐటీడీఏకు బతుకమ్మ చీరలు

గతేడు మిగిలిపోయిన బతుకమ్మ చీరలను ఐటీడీఏ పరిధిలోని మహిళా సంఘాలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ చీరలను తిరిగి పంపించాలని ప్రభుత్వం డీఆర్డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో చీరలను తిప్పిపంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నా రు. గతేడు జిల్లాకు 2లక్షల 37వేల చీరలను పంపిణీ చేయగా.. 5,910 చీరలు మిగిలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. కొత్తగా బతుకమ్మ చీరల పంపిణీ పై ఇంకా ఎలాంటి ఆదేశాలు లేవని అధికారులు పేర్కొంటున్నారు. గతంలో 18 ఏళ్లు నిండిన ఆడపడుచులందరికీ బతుకమ్మ చీరలను అందించారు. వివిధ రకాల చీరలను బంగారు, వెండి రంగుల్లో ఆకర్షణీయంగా తయారు చేయించి పంపిణీ చేశారు. ఒక్కో చీర ఖరీదు రూ.500ల నుంచి రూ.700 వరకు ఉంటుందని తెలుస్తుంది. ప్రభుత్వం ఖరీదైన, నాణ్యతతో కూడిన చీరలనే పంపిణీ చేసినా.. మహిళలు మాత్రం బతుకమ్మ చీరల పంపిణీపై అంతగా ఆసక్తిని కనబర్చలేదు. కొన్ని మండలాల్లో మహిళలు బహిరంగంగానే తిరస్కరించారు. దీంతో మిగిలిపోయిన చీరలను ఈసారి ఏజెన్సీ మారుమూల గ్రామాల్లోని మహిళా సంఘాలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. కానీ మిగిలిపోయిన చీరలను మళ్లీ పంపిణీ చేస్తే మహిళలు ఎలా స్పందిస్తారోనన్న అనుమానాలు అధికారుల్లో వ్యక్తమవుతున్నాయి.

నగదు సహాయంపై ఆశలు

గతంలో మాదిరిగా కాకుండా ఈసారి బతుకమ్మ పండుగకు అర్హులైన మహిళలందరికీ నగదు సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో నగదు సహాయంపై మహిళలు ఆశలు పెట్టుకుంటున్నారు. ఇప్పటికే ఈ విషయమై కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. పండుగకు సమయం దగ్గర పడడంతో ప్రభుత్వ నిర్ణయంపై మహిళల్లో ఆసక్తి కనిపిస్తోంది. దాదాపుగా ఈసారి చీరల పంపిణీ ఉండదన్న అభిప్రాయాలే వ్యక్తమవుతున్నా యి. దీంతో నగదు సహాయంపై మహిళలు చర్చించుకోవడం కనిపిస్తోంది. ఒక్కో మహిళకు మహిళా సంఘాల ద్వారా రూ.500లను అందించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల ద్వారా తెలుస్తుంది. త్వరలోనే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు. నగదు సహాయం పంపిణీతో కొత్త ఇబ్బందులు తలెత్తే అవకాశాలు కూడా లేకపోలేదంటున్నారు. క్షేత్రస్థాయిలో మహిళలకు ప్రభుత్వ సహాయం అందడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నగదు సహాయంతో అవకతవకలు జరిగే అవకాశం ఉందంటున్నారు. బతుకమ్మ తయారీకి అవసరమైన నగదును అందిస్తే సరిపోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ప్రభుత్వం అందించిన చీరలను ధరించేందుకు మహిళలు ఆసక్తి చూపకపోవడంతో కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం వృధా అయ్యిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు మహిళలు బతుకమ్మ చీరలను అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు వినియోగించగా.. మరి కొంత మంది ప్లాస్టిక్ డబ్బాలను కొనుగోలు కోసం ఉపయోగించినట్లు సమాచారం. ఇలాంటి పరిస్థితుల్లో బతుకమ్మ చీరల పంపిణీపై పెద్దగా డిమాం డ్లు రావడం లేదని తెలుస్తుంది.



మహిళలకు ఆసక్తి కలిగిన చీరలనే పంపిణీ చేయాలి

: కాటిపెల్లి సునితారెడ్డి, తలమడుగు



ప్రభుత్వం మహిళలకు ఇష్టమైన, ఆసక్తి కలిగిన చీరలను పంపిణీ చేస్తే బాగుంటుంది. నచ్చిన రకాలు, రంగుల చీరలను మాత్రమే మహిళలు ధరిస్తారు. ప్రస్తుతం మార్కెట్లో ఉండే డిజైన్లను తయారు చేయించి పంపిణీ చేస్తే మంచిది. ప్రభుత్వం పంపిణీ చేసే చీరలు మహిళలకు నచ్చక పోవడంతోనే ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం నేరుగా మహిళలకు నగదు సహాయాన్ని అందిస్తే ఇష్టమైన చీరలను కొనుగోలు చేసుకునే అవకాశం ఉంటుంది. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రభుత్వం బతుకమ్మ పండుగకు కానుకను అందించాలి.

సంక్షిప్త సమాచారం

ఇచ్చోడ ఎస్సైగా తిరుపతి

ఇచ్చోడ, సెప్టెంబరు, 28: ఇచ్చోడ మండల పోలీస్ స్టేషన్ ఎస్సైగా తిరుపతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. అయితే, జగిత్యాల ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయనను బదిలీపై ఇచ్చోడ ఎస్సైగా నియమించగా.. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై నరేష్‌ను ఆదిలాబాద్ హెడ్‌క్వార్టర్‌కు అటాచ్ చేశారు.

నేడు ఎమ్మెల్యే అనిల్ రాక

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 28: ఈనెల 29 ఆదివారం మండలానికి బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రానున్నారని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని డేడ్రాతో పాటు మాన్కాపూర్ గ్రామానికి మధ్యాహ్నం 12గంటలకు చేరుకుంటారని తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు సకాలంలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పేర్కొన్నారు.

'దీక్షను విజయవంతం చేయండి'

మావల, సెప్టెంబరు 28: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదుట ఆదివారం ఉదయం 11 గంటలకు బీసీ కులాల ఐక్య వేదిక, బీసీ జన సభ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీల సత్యాగ్రహ దీక్షను బీసీ కులస్తులందరూ విజయవంతం చేయాలని బీసీ సంఘం జిల్లా నాయకులు కాశవేణి నారాయణ యాదవ్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీక్షకు బీసీ జన సభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం యాదవ్ రానున్నట్లు తెలిపారు. సమావేశంలో బీసీ సంఘం నాయకులు మంగదుడ్ల శ్రీనివాస్ యాదవ్, రవికాంత్, మహేందర్, పోలోజీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీపై ప్రజా వేదిక

బోథ్, సెప్టెంబరు 28: ఉపాధిహామీ కార్యక్రమంలో చేపట్టిన పనులపై మండలంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. పది రోజుల పాటు జరిగిన సామాజిక తనిఖీలు, గుర్తించిన అంశాలపైన ఈనెల 30న ప్రజా వేదిక నిర్వహించనున్నారు. కార్యక్రమానికి అన్ని గ్రామాల సిబ్బంది అధజకారులు హాజరు కావాలని ఎంపీడీవో జీవన్‌రెడ్డి, ఏపీఎం జగదేవరావులు కోరారు.

హెచ్ఐవీపై అవగాహన

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 28: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు శనివారం మండలకేంద్రంలోని స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద కళాజాతా బృందం ద్వారా హెచ్ఐవీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాజాతా బృందం సభ్యులు ఎయిడ్స్ (హెచ్ఐవీ) వ్యాధి ఎలా వస్తుంది? నివారణ చర్యలు, తదితర వాటిపై పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందం టీం లీడర్ సీహెచ్ దామోదర్, సభ్యులు శంకర్, విలాస్, రవి, నవ్య, తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం సభ్యులు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా న్యాయాధికారి టి.ప్రభాకర్‌రావు ● జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ ● పాల్గొన్న ఎస్పీ, న్యాయాధికారులు

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 28: జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషి చేస్తున్నామని జిల్లా న్యాయాధికారి టి.ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా అధికార సంస్థ కార్యాలయంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. రాజీమార్గం ద్వారా పలు కేసులను పరిష్కరించి రాజీపత్రాలను కక్షిదారులకు అందించారు. ఈ సందర్భంగా కక్షిదారులు అనుభవాలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ నేరం పర్యవసానం తెలిస్తే నేరాలు తక్కువ అవుతాయన్నారు. దాని కోసం డీఎల్ఎస్ఏ ద్వారా చట్టాలపై అవగాహణ కల్పిస్తున్నట్లు వివరించారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని వృధా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేలా ప్రతీ మూడు నెలలకు ఒకసారి జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రిమినల్, సివిల్, ఇన్సూరెన్స్, తదితర వాటిని పరిష్కరించేలా అందరి సహకారం తీసుకున్నామన్నారు. కక్షిదారులు ప్రతీ మూడునెలలకు ఒకసారి నిర్వహించే లోక్‌ఆదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు శివరాం ప్రసాద్, ప్రమీల జైన్, మంజుల సూర్యవార్, దుర్గారాణి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.



రాజీపత్రాలను కక్షిదారులకు అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి, ఎస్పీ

● రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే సత్వర న్యాయం

బోథ్: రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే సత్వరం న్యాయం జరిగే అవకాశం ఉందని మున్సిఫ్ మేజిస్ట్రేట్ బి.హాస్సేన్ పేర్కొన్నారు. శనివారం లోక్ అదాలత్ ద్వారా కోర్టు పరిధిలోని ఒక 172 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరిగిందన్నారు. బ్యాంకు అదాలత్ ద్వారా రూ.46 లక్షల 84 వేలు రికవరీ చేయడం జరిగిందని వివరించారు. లోక్ అదాలత్ కార్యక్రమాల నిర్వహణ వల్ల కక్షిదారులకు సమయం ఆదా కావడంతో పాటు కేసులను తక్కువ సమయంలో పరిష్కరించుకునే వీలుందన్నారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీధర్, ఏపీజీ పంద్రం శంకర్, న్యాయవాదులు అంగత్ రూపేందర్‌సింగ్, హరీష్ విజయ్, జమీర్, రాములు, దమపాల్, మజీద్‌తో పాటు బోథ్ ఎస్సై ప్రవీణ్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

● ఉట్నూర్‌లో 268 కేసుల పరిష్కారం

ఉట్నూర్: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ ఆదాలత్‌లో 268 కేసులు పరిష్కరించడం జరిగిందని జూనియర్ సివిల్‌జడ్జి, న్యాయ సేవా సంస్థ చైర్మన్ మౌనిక పొన్నపల్లి తెలిపారు. 45 కేసులు పరస్పర అంగీకారంతో కేసులు పరిష్కరించామని, 96 పరిష్కరించి రూ.76.42 లక్షలు సెటిల్మెంట్ చేయడం జరిగిందన్నారు. 110 ఎ స్టీసీ కేసులు పరిష్కరించామని మొత్తం వనివారం జరిగిన లోక్ ఆదాలత్‌లో 268 కేసులు పరిష్కరించామన్నారు.



రిజిష్టర్లను పరిశీలిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద



మహారాష్ట్రలోని రేణుకా మాతా ఆలయంలో పూజలు నిర్వహిస్తూ..

మహిళల భద్రత కోసం పటిష్ట చర్యలు

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 28: మహిళల భద్రతే ధ్యేయమని, మహిళల రక్షణ పట్ల ఎల్లవేళలా అండగా ఉంటామని, మహిళల భద్రత కోసం పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్‌గంగా భవన్ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియాతో ఆమె మాట్లాడారు. జిల్లా పర్యటనలో భాగంగా మూడు రోజుల పాటు చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. ఈ సందర్భంగా నూతన చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజకు చేరుకున్నాయా? లేదా? అనేది పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళల భద్రత అభివృద్ధి సంక్షేమం వైపు ముందు కెళ్తున్నామన్నారు. మారుమూల గిరిజన మహిళల వరకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా దృష్టికి వచ్చిన సమస్యలను పరిషరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమస్యలపై మహిళలు, బాలికలు, మహిళా కమిషన్ టోల్ ఫ్రీ నెం.9490555533 ద్వారా సంప్రదించాలని సూచించారు. పెన్‌గంగా గెస్ట్‌లో మహిళా కమిషన్ చైర్ పర్సన్‌ను ఎస్పీ గౌస్‌ఆలం మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఆ తర్వాత ఆదిలాబాద్ పట్టణంలోని సఖి కేంద్రాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రిజిష్టర్లను పరిశీలించి కేసు వివరాలను కేంద్ర నిర్వాహకులు సరస్వతిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, సెక్రటరీ సుభద్ర, డీడబ్ల్యూఓ సబిత, డీపీఆర్‌పీ తిరుమల, అధికారులు పాల్గొన్నారు.

● మాహోర్ రేణుక మాతా ఆలయాన్ని సందర్శించిన చైర్ పర్సన్

తలమడుగు: దేశంలోని 18 శక్తి పీఠాల్లో ఒకటైన మహారాష్ట్ర మాహోర్‌లోని ప్రసిద్ధ రేణుకా మాతా ఆలయాన్ని మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరేళ్ల శారద సందర్శించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత అనసూయ మాత, దత్తాత్రేయ స్వామి, ఇతర ఆలయాలను దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ అధికారులు అధికారి క లాంచనాలతో ఆమెకు స్వాగతం పలికారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ ఆదిలా బాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఉన్నారు.

ఆరోగ్య అలవాట్లలో మార్పులు చేయాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 28: దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు జీవన విధానం, ఆరోగ్య అలవాట్లలో మార్పులు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కృష్ణ సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. స్వయంగా ఆయన కూడా ఆరోగ్య పరీక్షలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ రోజు వారిగా తీసుకునే పోషకాలు తగ్గిపోవడంతోనే దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ లాంటివి త్వరగా వస్తాయన్నారు. వాటిని నిరోధించడానికి ప్రతీఒక్కరు వారి జీవన విధానంతో పాటు ఆరోగ్య అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం ఈనెల 29న ఉందని, ఆ రోజు ఆదివారం కావడంతో శనివారం సిబ్బందికి హెల్త్ చెకప్ చేయడం జరిగిందని తెలిపారు. రోజు తీసుకునే ఆహారాన్ని సమతుల్యంగా తీసుకోవాలని, నిత్యం వ్యాయామం చేయాలన్నారు. అప్పుడే ఎలాంటి వ్యాధులు ధరిచేరవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ సాధన, డాక్టర్ గజానంద్, డీఎంఓ డాక్టర్ శ్రీధర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మండల ఓటరు జాబితా విడుదల

● 31 గ్రామ పంచాయతీల పరిధిలో 23,439 ఓటర్లు

బజార్‌హత్నూర్, సెప్టెంబరు 28: మండలం పరిధిలోని 31 గ్రామ పంచాయతీల నూతన ఓటరు జాబితాను మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల నుంచి గ్రామ పంచాయతీలలోని ప్రతీ ఇంటింటికీ వెళ్లి ఎటువంటి పొరపాట్లు లేకుండా కార్యదర్శులు ఓటరు జాబితాను తయారు చేశారన్నారు. మండలవ్యాప్తంగా 31 గ్రామ పంచాయతీల పరిధిలో 244 వార్డులలో 23,439 మంది ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో 11531 మంది పురుషులు, 11908 మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. మండలంలో పురుష ఓటర్ల కంటే 377 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేందర్ రెడ్డి, కార్యదర్శి సునీల్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

తలమడుగు, సెప్టెంబరు 28: మండలంలోని ఆయా గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ప్రత్యేక అధికారులు తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలలో అమలవుతున్న పౌష్టికాహారాన్ని తప్పకుండా మెనూ ప్రకారం అందించాలన్నారు. మండలంలోని జరీ, చర్లపల్లి, రుయాడి తదితర గ్రామాల్లో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, మండల కేంద్రంలోని అంగన్‌వాడీలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, ఏవో ప్రమోద్‌రెడ్డి, తదితరులు అంగన్‌వాడీ కేంద్రాలలో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులను ప్రైవేట్ నుంచి ప్రభుత్వ బడుల వైపు రప్పించాలి: ఎంఈవో

బోథ్, సెప్టెంబరు 28: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని ప్రతిభావంతులను ఉపాధ్యాయులు ఉన్న కొంత మంది వారి తల్లిదండ్రులు స్టేటస్ కోసమని విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్న ఉపాధ్యాయులు వారిని ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా కృషి చేయాలని ఎంఈవో పోశెట్టి కోరారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య రంగంలో బోథ్ మండలం వెనుకంజలో ఉందన్నారు. అయితే విద్యార్థులను ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా గణిత శాస్త్రంలో విద్యార్థులు వెనుగంజలో ఉంటున్నారని అయితే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో బోథ్ మండలంలో విద్య వ్యవస్థపైన అసంతృప్తి వ్యక్తిపరి చారని పేర్కొన్నారు. తరగతుల నిర్వహణ పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని సూచించారు. అంతకు ముందు సమావేశంలో మానసిక శారీరక అంగవైకల్యం ఉన్న విద్యార్థులను గుర్తించాలని అందుకు ప్రశిష్ఠ యాప్‌ను వినియోగించుకోవాలన్నారు. ఇందులో 21 రకాల వ్యాధులపైన 60 రకాల ప్రశ్నలు ఉన్నాయని, వీటిని ఉపాధ్యాయులు గుర్తించి ఆన్‌లైన్ నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీఆర్‌పీ సంగు స్వామితో పాటు ఎస్సీ ఆర్పీల ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ బదిలీల్లో పైరవీలు

● రంగంలోకి దిగిన ట్రాన్స్‌కో ఇంటలిజెన్స్ అధికారులు

బోథ్, సెప్టెంబరు 28: రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల బదిలీల పరంపర ప్రారంభమైంది. దీంతో ఆర్థిక బలం రాజకీయ పలుకుబడి యూనియన్ల బలం ఉన్న వారు కోరుకున్న చోటికి బదిలీ చేయించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారన్నారు. లైన్‌మెన్ మొదలుకుని ఏఈ, డీఈల వరకు బదిలీ ప్రక్రియ ప్రారంభమైంది. అయితే కొంత మంది స్థాన చలనానికి ఇష్టపడకపోవడంతో యూనియన్ల ద్వారా అధికారులపై కోరుకున్న చోటికి బదిలీ కావడానికి తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. మరో వైపు ఉన్నతస్థాయిలో ఉన్న ఉద్యోగులు లక్షలు కుమ్మరించి బదిలీ కాకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అయితే డబ్బుల వ్యవహారంతో పాటు యూనియన్ నాయకుల ఒత్తిళ్ళు అధికంగా ఉండంతో ఆర్థిక బలం లేని యూనియన్ సహకారం లేని ఉద్యోగులు మనోవేదనకు గురవుతున్నారు. అయితే విషయం బయటకు రావడంతో రాష్ట్ర స్థాయి అధికారులు అక్రమాలను బయటకు తీసుకువచ్చేందుకు రంగంలోకి ఇంటలిజెన్స్ ట్రాన్స్‌కో విజిలెన్స్ అధికారులను రంగంలోకి దించినట్లు తెలిసింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను అందజేసిన సీఐ

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 28: పోగొట్టుకున్న సెల్ ఫోన్లను బాధితులకు శనివారం ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు అందజేశారు. వివరాలకు వెళ్తే ఇటీవల పట్టణంలోని చించార్ వాడకు చెందిన జోగు సాయి ప్రియ, అదేవిధంగా స్థానిక అశోక్ రోడ్డుకు చెందిన ఎండి అలీమ్ తమ ఫోన్లను పోగొట్టుకున్నారు. ఈ మేరకు వన్ టౌన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లను కనుక్కున్నారు. సీఐ సునీల్ కుమార్ బాధితులకు పోలీస్ స్టేషన్‌కు పిలిచి వారి వారి ఫోన్లను అందజేశారు.

సీఎంను దూషించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 28: సీఎం రేవంత్ రెడ్డిపై అసభ్య పదజాలంతో దూషించినందుకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇసాక్ అలీ తెలిపారు. వివరాలు ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు సమీపంలో శుక్రవారం నీటి వనరుల సంరక్షణ కోసం చేపడుతున్న సర్వేలో ఖానాపూర్‌కు చెందిన గూడారం గంగన్న హైడ్రా పేరుతో ఇళ్లను కూల్చివేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై అసభ్య పదజాలంతో దూషించారు. దీంతో గంగన్నతోపాటు మరి కొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 28: జిల్లా కేంద్రంలో దారుణం చోటు చేసుకుంది. మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కరుణాకర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ పట్టణంలోని ఓ కాలనీకి చెందిన మూడేళ్ల చిన్నారి శనివారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి (45) ఆ చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డట్లు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు.

పిడుగు పడి మూడు ఆవుల మృతి

జైనథ్, సెప్టెంబరు 28: మండలంలోని రాజుర గ్రామానికి చెందిన జాదవ్ గణేష్, ఆడే మంచ్కాకు చెందిన ముడు ఆవులు గురువారం సాయంత్రం పిడుగు పాటుకు గురై మృతి చెందాయని రైతులు తెలిపారు. దాదాపు లక్ష రూపాయల విలువ చేసే ఆవులు మృతి చెందాయని ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

'పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలి'

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 28: విద్యార్థినులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో మాస ఉమాదేవి అన్నారు. శనివారం మండలంలోని హీరాపూర్‌ని కస్తూర్బా గాంధీ వసతి గృహాన్ని సందర్శించి పోషణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.



ఉపాధి పనుల విషయమై ఆరా తీస్తున్న అదనపు డీఆర్‌డీవో

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఇచ్చోడ, సెప్టెంబరు 28: ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలో గుర్తించిన లొసుగులు, లోటుపాట్లను శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో వెల్లడించారు. అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) కుటుంబరావ్, ఏపీడీ కృష్ణారావ్ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు వరకు రూ. 4.48కోట్ల నిధులతో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నివేదికను విని పించారు. మండలంలోని గ్రామాల వారీగా సామాజిక బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది తమకు సమాచారం ఇవ్వకుండానే గ్రామసభలు నిర్వహించారని పలువురు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో మస్టర్‌లో తనిఖీ చేసిన సాంకేతిక, క్షేత్ర సహాయకుల సంతకాలు చేయలేదని, బకాయిలు ఇవ్వలేదని, పనులు చేయకుండానే డబ్బులు డ్రా చేసినట్లు, నాటిన మొక్కలు ఎండిపోయాయాని, మొక్కలు చాలావరకు చనిపోయాయాని సమావేశంలో డీఆర్పీలు వివరించారు. ఇందులో అంబోడ్స్‌మెన్ వీణ, ఎంపీడీఓలు లక్ష్మణ్, రాంప్రసాద్, ఏపీఓ నరేందర్‌గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పంచాయితీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక

నేరడిగొండ, సెప్టెంబరు 28: జోనల్ స్థాయి పోటీలను శుక్రవారం ఐటీడీఏ కొమురంభీం ప్రాంగణం ఉట్నూర్‌లో నిర్వహించగా మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు గుగ్లోత్ అంబారావ్ అన్నారు. శనివారం రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. నవంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్-17 విభాగంలో వాలీబాల్‌లో అనుష్క, జ్యోతి, కృష్ణవేణి, అండర్-14లో వాలీబాల్‌లో శ్రేయ, అంజలిదేవి, దీపిక, కబడ్డీలో భీంబాయి, ఆర్థిక స్వాతిలు ఎంపికయ్యారని వారందని పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఇందులో పీఎస్‌హెచ్‌ఎం భీంరావ్, ఉపాధ్యాయులు శంకర్, రాములు, శశికాంత్, పీఈటీలు, తదితరులున్నారు.

'అక్రమంగా గంజాయి సాగుచేస్తే చర్యలు'

ఇచ్చోడ, సెప్టెంబరు, 28: మండలంలోని గుబ్బాతండా గ్రామశివారులో పత్తిలో అంతరపంటగా సాగుచేస్తున్న గంజాయి మొక్కలను స్వాధినపరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఇచ్చోడ సర్కిల్ సీఐ భీమేష్ తెలిపారు. పక్క సమాచారం మేరకు శనివారం గుబ్బాతండాలో గత మూడెళ్లుగా పత్తిలో అంతర పంటగా గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించగా పంటపొలంలో 30గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. లభ్యమైన గంజాయి మొక్కలను స్వాధీన పర్చుకున్నట్లు వారు తెలిపారు. వీటి విలువ రూ.45వేల వరకు ఉంటుందన్నారు. ఈ మేరకు పెందుర్ మానిక్‌రావ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. సీఐ వెంట ఎస్సై తిరుపతి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అటవీ అధికారులకు రక్షణ కల్పించాలి'

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 28: అటవీ రక్షణలో రాత్రీపగలు విధులు నిర్వహించి అటవి అధికారులపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయని, వీటి నివారణకు ప్రభుత్వం అటవి అధికారులకు ఆయుధాలు ఇవ్వాలని ఎఫ్ఆర్ఓ గులాబ్‌సింగ్ కోరారు. వరంగల్ జిల్లా ములుగు అటవీ అధికారులపై దాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ గులాబ్‌సింగ్ మాట్లాడుతూ అటవి రక్షణకు కృషి చేస్తున్న అధికారులు నిత్యం దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అటవి అధికారులు నరేష్, కృష్ణ, సాయి,ప్రవీణ్, అమర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపి సర్వే చేపట్టాలి

● మున్సిపల్ సర్వసభ్య సమావేశం గరంగరం

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 28: ఆదిలాబాద్ పట్టణంలోని లీజ్ స్థలాలు అన్యాక్రాంతమవుతుంటే న్యాయవాదులకు డబ్బులిచ్చి ప్రయోజనమేంటని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించారు. చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్యానెల్ లాయర్‌కు నిధులు చెల్లించాలని ఎజెండాలో పొందుపర్చడంపై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ బండారి సతీష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రూ.కోట్లు విలువైన స్థలాలు కనుమరుగవుతుంటే లాయర్లకు రూ.లక్షలాది పీజులు చెల్లించడంలో ప్రయోజనమేంటని ప్రశ్నించారు. లీజు స్థలాల ఎన్‌ఓసీ, పట్టాలను పరిశీలించి వాటిని సంరక్షించేలా తగు వివరాలతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. మరో కౌన్సిలర్ జహీర్ రంజానీ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు వెచ్చించాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను అధికారులు అడంబరాలకు వృథాగా ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. రూ.లక్షలను సద్వినియోగం చేస్తున్నారని దీంతో వార్డుల్లో సమస్యల పరిష్కారం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ముఖ్యంగా మైనార్టీ వార్డులకు నిధులివ్వకుండా ఉద్దేశ్యపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్నారని అధికారుల తీరుపై మండిపడ్డారు. రూ.82 లక్షలతో నిర్మించిన ఏబీసీ సెంటర్ ఏడాది గడువకముందే పగుళ్లుతేలాయని అందుకు కారకులెవరని ప్రశ్నించారు. ఇంజనీరింగ్ అధికారుల అవినీతి కారణంగానే ఈ పరిస్థితి ఉందని, అందుకు బాధ్యులైన అధికారుల అవినీతి కారణంగానే ఈ పరిస్థితి ఉందని, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరో కౌన్సిలర్ వెనుగంటి ప్రకాష్ మాట్లాడుతూ తనవార్డులోని పార్కు స్థలానికి అధికారులు ఎలా డోర్ నెంబర్ జారీ చేస్తారని ప్రశ్నించారు. అక్రమంగా జారీ చేసిన డోర్ నెంబర్‌ను వెంటనే రద్దు చేసి రూ.కోట్ల విలువైన పార్కు స్థలాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. కాగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఖానాపూర్ చెరువులో చేపట్టిన సర్వేతో బాధితులు ఆందోళన చెందుతున్నారని, వారికి ప్రత్యామ్నాయ పునారావసం కల్పించాకే సర్వేను చేపట్టాలని పేర్కొన్నారు. ఈ విషయమై అన్ని పార్టీల కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిసి ముందు ప్రత్యామ్నాయం చూపినన తర్వాతనే సర్వే నిర్వహించాలని కోరుతామన్నారు. అనంతరం ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

పట్టుదల ఉంటే సాధించ లేనిది లేదు

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, సెప్టెంబరు28: 'బోథ్ ఎమ్మెల్యేగా పడిలేచి 15 ఏళ్లకు నా కల సాకారం చేసుకున్నాను. పట్టుదల ఉంటే సాధించ లేనిది ఏది లేదు' అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని తల్లిదండ్రులు గురువుల పేరు నిలబెట్టాలన్నారు. తర్వాత పాఠశాలలో స్టేజ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా ఆదేశం మేరకు ఏర్పాటు చేసిన సోలార్‌పెన్సింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బోథ్ నేరడిగొండ మాజీ ఎంపీపీ తుల్లశ్రీనివాస్, రాథోడ్‌సజన్, తిరుమల్‌గౌడ్, జహీర్, నానక్‌సింగ్, దేవన్న, అభిరాంరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్, సురేందర్, సాయిరాం, పీజీహెచ్‌ఎం తదితరులున్నారు.

'12 శాతం రిజర్వేషన్ కల్పిచాలి'

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 28: ఎస్సీ వర్గీకరణ జిల్లాల వారీగా చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మాదిగల మేలుకొలుపు యాత్రలో భాగంగా శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఆరోగ్య పరీక్షలు

ఉట్నూర్, సెప్టెంబరు 28: మండలంలోని నర్సాపూర్(బి) బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు గిరిజన బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గిరిజన ప్రాంతాలలోని పాఠశాలలో చదువుకుంటున్న బాలికలకు రక్తలేమి అధికంగా ఉంటుందని గుర్తించిన ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషణ మిత్ర కార్యక్రమాన్ని ఇటీవల రాష్ట్ర మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ నేపథ్యంలో అన్ని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బాలికలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ప్రతి విద్యార్థినికి ఆరోగ్య కార్డు ఏర్పాటు చేయాలని భావిస్తుండడంతో శనివారం ఆర్‌బీఎస్ అధికారుల బృందం డాక్టర్ హరిప్రియ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందు డాక్టర్ హరిప్రియ, హెచ్‌ఎం రాథోడ్‌ప్రకాష్, టీచర్లు రాజేశ్ చౌహాన్, ఫార్మాసిస్టు రాధా, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

తాంసి, సెప్టెంబరు 28: ప్రస్తుతం వర్షాకాలమైనందున పరిసరాల పరిశుభ్రతపై ప్రతీఒక్కరు దృష్టి పెట్టాలని మండల వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. శనివారం బండల నాగపూర్, అట్నంగూడ గ్రామాల్లో వైద్య బృందం పర్యటించింది. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. మురికి నీరు నిలువ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ తులసీరామ్, లక్ష్మీ, పద్మ, అరుణ, తదితరులు ఉన్నారు.

'గురుకుల సమస్యలు పరిష్కరించాలి'

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 28: పాఠశాలలో విద్యార్థులకు, విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సిబ్బంది శనివారం మండలంలోని ముత్నూర్ గురుకులం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది చాక్ డౌన్ పెన్ డౌన్‌లో భాగంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో కొత్త టైమింగ్ 8 నుంచి కాకుండా పాత టైమింగ్ ప్రకారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల టైమింగ్‌ను మార్చాలని, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పాఠశాలల్లో ఉండే విధానాన్ని తొలగించి ప్రత్యేకంగా టేకికేర్ సిబ్బంది నియమించాలని అన్నారు. ఇందులో గురుకులం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీప్రియ, వైస్ ప్రిన్సిపాల్‌లు సంగీత, విజయ, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినులు ఉన్నారు.



నీటి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

'తాగునీటి ఎద్దడి తగ్గించేందుకు కృషి'

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 28: పట్టణంలో తాగునీటి ఎద్దడి తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని వాల్మీకినగర్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా చేపడుతున్న అమృత పథకంలో భాగంగా 10లక్షల లీటర్ల కెపాసిటీతో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మనిషి జీవనాధారమే నీరు ఆ తర్వాతే మిగత విషయాల పై ఆధారపడి ఉంటాడని తెలిపారు. ప్రస్తుతం ఉన్న కోటి లీటర్ల ఓహెచ్ఎస్ఆర్‌తో పాటు మరో కోటి లీటర్ల ఓహెచ్ఎస్ఆర్ సామర్థంతో నిర్మించింది ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధులు అమృత్ పథకంలో భాగంగానే ఇవ్వనుందన్నారు. పట్టణానికి సంబంధించిన మురికి నీరంతా చెరువులలో, లాండసాంగి, అనుకుంటా, భీంసారి వాగులో కలుషీతం అవడంతో నీరు తాగేందుకు ఇబ్బంది అవుతుందని తెలిపారు. ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణం కోసం స్థలాలను సైతం ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిసనర్ కమర్‌హైమద్, బీజేపీ నాయకులు లాలా మున్నా, ఆకుల ప్రవీణ్, జోగురవి, దయాకర్, భూమారెడ్డి,రాజు, రఘుపతి, భరత్, రఘు, కృష్ణారెడ్డి, చారిముకుంద్‌రెడ్డి, తదితరులున్నారు.

'ఉన్నత విద్యవైపు అడుగులు వేయాలి'

ఉట్నూర్, సెప్టెంబరు 28: గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం రాత్రి ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో గల బాలికల పోస్టుమెట్రిక్ వసతి గృహాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ మాట్లాడుతూ రాత్రింబవళ్లు కష్టపడి చదవాలని అన్నారు. లక్ష్యం గొప్పదై ఉండాలని, ఆదిశగా ప్రతి ఒక్కరు అడుగులు వేయాలని సూచించారు.

'విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి'

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 28: జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవన్‌లో పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సాయి కుమార్ అధ్యక్షతన పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను శనివారం నిర్వహించారు. ఉపాధ్యక్షులు ఎం.నరేందర్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికై విద్యార్థులు పోరుబాట పట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తున్నాయన్నారు. విద్యార్థి అమర వీరుల ఆశయ సాధనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు.

'విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తాం'

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 28: స్వతంత్ర సమరయోధుడు షహీద్ భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తామని యూఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అల్తాఫ్ అన్నారు. శనివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ బంగ్లా సమీపంలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అల్తాఫ్ మాట్లాడుతూ దేశం కోసం పిన్నవయస్సులో ప్రాణాలర్పించిన షహిద్‌భగత్ స్ఫూర్తితో సంఘం పని చేస్తుందన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తూ విద్యార్థులకు అండగా ఉంటామన్నారు. భగత్‌సింగ్ భౌతికంగా లేకపోయినా.. ఆయన ఆశయాలు తమ మదిలో ఉన్నాయన్నారు. ఆయన స్ఫూర్తి, ఆశయాలను నేటి తరం విద్యార్థులకు తెలియజేస్తామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అండర్- 14 నిర్మల్ జిల్లా స్థాయి బాల బాలికల కబడ్డీ ఎంపిక పోటీలు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 28 : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సిర్గాపూర్‌లోని ప్లేయర్ హైస్కూల్‌లో శనివారం అండర్-14 కబడ్డీ బాల బాలికల జిల్లా స్థాయి ఎంపిక పోటీలను దిలావర్‌పూర్ విద్యాధికారి కస్తూరి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్లేయర్ హైస్కూల్ కరస్పాండెంట్ నరసింహా రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రవీందర్ గౌడ్, మాజీ డిప్యూటీ ఎస్‌వో ఎం. శ్రీనివాస్, మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వై. రమణ రావు, పీఈటీ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రకాష్‌రాజ్‌కు గుణపాఠం నేర్పుతాం'

భైంసా, సెప్టెంబరు 29 : సినీనటుడు ప్రకాష్ రాజ్ హిందూ వ్యతిరేక విధానాలను విడనాడకపోతే తగు రీతిలో గుణపాఠం నేర్పుతామని బీజేవైఎం భైంసా డివిజన్ ప్రతినిధి గంగాప్రసాద్ హెచ్చరించారు. శనివారం స్థానికంగా మాట్లాడారు తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు విషయంలో సినీ నటుడు ప్రకాష్‌రాజ్ వివాదస్పద వ్యాఖ్యలు చేసాడని ఆరోపించారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టెలా చర్యలు చేపడుతున్నాడని దుయ్యబట్టారు.వ్యంగాస్త్రాలతో సమస్యలు సృష్టిస్తున్నాడని పెర్కొన్నారు. ఇకనైనా ఈ విధానాలకు స్వస్తి చెప్పాలని హితవు పలికారు. లేని పక్షంలో తగు రీతిలో గుణపాఠం తప్పదన్నారు.

అనుమతి లేకుండా ఆసుపత్రి నిర్వహించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ఖానాపూర్, సెప్టెంబరు 28 : ఎటువంటి అనుమతి లేకుండా ఖానాపూర్ వివేకానంద చౌక్‌లో ప్రైవేట్ ఆసుపత్రిని నిర్వహిస్తున్న వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజనల్ కార్యదర్శి సునారికారి రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివరాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్హత లేని వైద్యులను తెచ్చి ఖానాపూర్‌లో ఆసుపత్రి నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే వారిని అధికారులు ఉపేక్షించవద్దన్నారు. ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆసుపత్రిని సీజ్ చేయాల్సింది పోయి జరిమానా విధిస్తామని చెప్పడం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు దుర్గం లింగన్న, చిన్న రాజన్న, తదితరులున్నారు.

బీజేపీ సభ్యత్వం తీసుకోండి.. మోదీకి మద్దతు ఇవ్వండి

లక్ష్మణచాంద, సెప్టెంబరు 28 : భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తీసుకుని మన భారత ప్రధాని నరేంద్ర మోదీజీకి మద్దతు ఇవ్వాలని సభ్యత్వ నమోదు కమిటీ మండల కన్వీనర్ అడ్వాల రమేష్ శనివారం అన్నారు. మండలంలోని బోరిగాం గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక యువత, ప్రజలకు పై విధంగా సందేశం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అందరూ గుర్తించి బీజేపీకి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పొలాస గోవర్ధన్, నాయకులు మంతోన చంద్రమోహన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నిజ జీవితంలో విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడే విధంగా బోధన కొనసాగాలి

లక్ష్మణచాంద, సెప్టెంబరు 28 : నిజ జీవితంలో విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పడే విధంగా బోధన కొనసాగాలని మండల ఇంచార్జి విద్యాధికారి అశోక్‌వర్మ శనివారం అన్నారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్ ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ అనే అంశంపై తెలుగు బోధించే ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణను ఇచ్చారు. విద్యార్థులు స్వయంగా చెప్పే విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రూమ్ టు రీడ్ మండల కోఆర్డినేటర్ గోవర్ధన్ నాయకుడు, తెలుగు బోధన రిసోర్స్ పర్సన్స్ సాయన్న, రాజేశ్వర్, సీఆర్పీలు పాల్గొన్నారు.


రెచ్చిపోతున్న మొరం మాఫియా

- ఖానాపూర్‌లో తహసీల్దార్ ఆదేశాలు బేఖాతరు
- సీజ్ చేసి 24 గంటలు గడిచినా తహసీల్దార్ కార్యాలయానికి తరలించని టిప్పర్లు
- వదిలేయాలని అధికార పార్టీ నేతల ఒత్తిడి
- ఇప్పటికీ రోడ్డు పక్కనే ఉన్న సీజ్ చేసిన మూడు టిప్పర్లు, జేసీబీ
- కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను : తహసీల్దార్ శివరాజ్



మొరం తీసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శివరాజ్

ఖానాపూర్, సెప్టెంబరు 28 : తహసీల్దార్ సీజ్ చేసిన తమ టిప్పర్లను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురాకుండా మొరం మాఫియా జులాం ప్రదర్శించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ శివారు ప్రాంతంలో గల ప్రభుత్వ భూమి నుండి అక్రమంగా మొరాన్ని తరలిస్తున్న మూడు టిప్పర్లను శుక్రవారం సాయంత్రం ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్ సీజ్ చేసినట్లు తెలిసింది. సీజ్ చేసిన మొరం టిప్పర్లు, జేసీబీని ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురావాలని తహసీల్దార్ శివరాజ్ సంబంధిత టిప్పర్ డ్రైవర్లను ఆదేశించారు. తహసీల్దార్ చెప్పిన వెంటనే కార్యాలయానికి బయలుదేరిన టిప్పర్లు మార్గమధ్యంలోనే నిలిచిపోయాయినట్లు చెబుతున్నారు. దీంతో తహసీల్దార్ తన కార్యాలయానికి చేరుకున్నప్పటికీ తాను పట్టుకున్న టిప్పర్లు మాత్రం రాకపోవడంతో తిరిగి ఆరా తీసిన తహసీల్దార్ పై అధికార పార్టీ నేతల ఒత్తిడి మొదలైనట్లు చెబుతున్నారు. తొలత అధికార పార్టీకి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి పీఏగా వ్యవహరిస్తున్న ఓ వ్యక్తి టిప్పర్లు తమకు సంబంధించినవని తహసీల్దార్‌పై ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. అయినా తహసీల్దార్ స్పందించకపోవడంతో పట్టణంలో కీలక పదవిలో ఉన్న మరో అధికార పార్టీ నేత టిప్పర్లను వదిలేయాల్సిందిగా తహసీల్దార్‌పై ఒత్తిడి చేసినట్లు చెబుతున్నారు. చివరికి జిల్లా స్థాయిలో చక్రం తిప్పుతున్న మరో నేతతో సైతం ఖానాపూర్ తహసీల్దార్‌పై ఒత్తిడి తేవడంతో వాహనాలను కార్యాలయానికి తెస్తే ఎటువంటిఇ ఇబ్బంది పెట్టకుండా వదిలిపెడతానని తహసీల్దార్ బదులిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కార్యాలయానికి వాహనాలను తేవాలని తనకు ఫోన్ చేసిన వారందరికీ సూచించినప్పటికీ తహసీల్దార్‌కు మాత్రం చేదు అనుభవమే దక్కినట్లు చెబుతున్నారు. అధికార పార్టీ నేతల ఒత్తిడి ఉండడంతో మొరం టిప్పర్లను కనీసం తన కార్యాలయానికి తీసుకువచ్చేందుకు తహసీల్దార్‌కు పోలీసులు కూడా సహకరించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ దందాకు పాల్పడిన ఈ వాహనాలను తహసీల్దార్ సీజ్ చేసి 24 గంటలు గడిచినప్పటికీ శనివారం సాయంత్రం వరకు సైతం సీజ్ చేసిన వాహనాలు తహసీల్దార్ కార్యాలయానికి చేరలేదు. ఈ వాహనాలను సదరు వాహన యజమానులు పట్టణ శివారులోని కొమరం భీమ్ చౌరస్తా సమీపంలో నిర్మల్ - మంచిర్యాల రహదారి ప్రక్కన నిలిపి ఉంచారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు సైతం ఖానాపూర్ తహసీల్దార్ వివరాలు తెలియజేసినట్లు చెబుతున్నారు. ఈ ఉదంతం చూస్తే అధికారుల కంటే అక్రమార్కులకే అండదండలు ఎక్కువగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రకృతి వనరులను కొల్లగొట్టే వారి సంఖ్య నానాటికి పెరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి తహసీల్దార్ సీజ్ చేసిన వాహనాలను ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి తరలించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఘటన స్థలంలో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన టిప్పర్లు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను : తహసీల్దార్ శివరాజ్

పట్టణ శివారు ప్రాంతంలోని డంపింగ్ యార్డ్ సమీపంలో గల ప్రభుత్వ భూమి నుంచి మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం సాయంత్రం ఘటన స్థలానికి వెళ్లాము. ఆ ప్రాంతం నుండి అక్రమంగా మొరం తరలిస్తున్న టీఎస్ 19 టీఏ 4741, ఏపీ 39 టీఎఫ్ 5080, ఏపీ 31 టీఎఫ్ 3558 అనే నెంబర్ గల మూడు టిప్పర్లు, ఒక బ్లూ కలర్ జేసీబీని సీజ్ చేశాను. సీజ్ చేసిన వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకురావాలని డ్రైవర్లను ఆదేశించినప్పటికీ వారు వాహనాలను కార్యాలయానికి తీసుకురాకుండా రోడ్డు ప్రక్కన నిలిపి ఉంచారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు అంకితమవ్వాలి

భైంసా,సెప్టెంబరు 28 : బాధ్యతాయుతమైన విధానాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులందరూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అంకితమవ్వాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పిలుపునిచ్చారు. ముథోల్ నియోజకవర్గ పరిధి నుంచి రాష్ట్ర, జిల్లాస్థాయిలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు కొత్తగా ఎంఈవోలుగా బాధ్యతలు చేపట్టిన అధికారులకు శుక్రవారం రాత్రి భైంసాలో అనసూయపవార్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ అభినందన సభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన చేపట్టి విద్యార్థులను అన్ని రంగాల్లోనూ నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి మార్గదర్శకమైన రీతిలో ఆదర్శంగా పాటుపడాలని కోరారు. నియోజక వర్గ పరిధిలో విద్యా వ్యవస్థను పటిష్టపరచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లుగా వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు తరగతి గదులు, ఫర్నిచరు కొరత లేకుండా చర్యలు చేపడుతున్నట్లుగా వివరించారు. ఖాళీగానున్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లినట్లుగా పేర్కోన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులందరూ మరింత బాధ్యతాయుతతో విద్యార్థుల ప్రగతికి పాటుపడాలన్నారు. సంస్కరంతో కూడిన విద్యను అందించి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని కోరారు. అనసూయ పవార్ ట్రస్టు ద్వారా ఎస్ఎస్ స్టడి సర్కిల్‌ను ఏర్పాటు చేసి ఉద్యోగార్థులకు అవసరమైన అన్ని రకాల శిక్షణను అందించి ఎందరో మంది నిరుద్యోగులకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డా. సతీష్ పవార్‌తో కలిసి ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు.

గ్రామ పంచాయతీ తుది ఓటరు జాబితా విడుదల

● నిర్మల్ జిల్లాలో 4,40,651ఓటర్లు ● మహిళా ఓటర్లే అధికం

ముథోల్, సెప్టెంబరు 28 : గ్రామ పంచాయతీ తుది ఎన్నికల ముసాయిదా ఓటరు జాబితాను శనివారం జిల్లా అధికారులు విడుదల చేశారు. జిల్లాలోని మొత్తం 18 మండలాల పరిధిలో గల 400ల గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాను జిల్లా కలెక్టర్ అభిలాష అబినవ్ విడుదల చేశారు. మొత్తం 400ల గ్రామ పంచాయతీలలో 4 లక్షల 40 వేల 651 మంది ఓటర్లు ఉండగా 3 వేల 368 వార్డులు ఉన్నట్లు కలెక్టర్ ప్రకటించారు. అలాగే 2 లక్షల 9 వేల 994 మంది పురుష ఓటర్లు ఉండగా 2 లక్షల 30 వేల 641 మంది మహిళా ఓటర్లు, 16 మంది ఇతరులు ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. అత్యధికంగా కుభీర్ మండలంలో 39 వేల 731 మంది ఓటర్లు ఉండగా పెంబి మండలంలో 10 వేల 846 మంది మాత్రమే ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం జీపీల, వార్డుల వారీగా అధికారులు తుది ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేశారు. అయితే జిల్లాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే 20,647 అధికంగా ఉన్నారు. జిల్లాలో మొత్తం 4,40,651 ఉండగా పురుషులు 2,09,994 ఉండగా మహిళా ఓటర్లు 2,30,641 ఇతరులు 16 మంది ఉన్నారు.

తుది ఓటరు జాబితా విడుదల

దిలావర్‌పూర్, సెప్టెంబరు 28 : మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాలకు సంబంధించిన తుది ఓటరు జాబితాను శనివారం విడుదల చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అరుణ రాణి, ఆయా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు తుది ఓటరు జాబితా విడుదల చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి : సీఐటీయూ


నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 28 : కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు శనివారం ధర్నా నిర్వహించి కలెక్టరేట్‌లో ఏవోకు వినతి పత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ... బాసర ట్రిపుల్ ఐటీ హౌస్ కీపింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, వీడీఏ నిధులు విడుదల, తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు పిరాజీ, భారతి, సాయిబాబా, లింగన్న ఆకాష్, తదితరులు పాల్గొన్నారు.

ముథోల్‌లో ఘనంగా భగత్‌సింగ్ జయంతి

ముథోల్, సెప్టెంబరు 28 : మండల కేంద్రమైన ముథోల్‌లో శనివారం భగత్ సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పలువురు మాట్లాడుతూ... భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్‌సింగ్ పాత్ర కీలకమని కొనియాడారు. పలు విషయాల్లో భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ దశరథ్, బి.లవణ్, టి.సాయిలు, కృష్ణ, భగత్ సింగ్ యువజన సంఘం సభ్యులు సాయికిరణ్, రవి, యోగేష్, రాజు, శ్రీకాంత్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

దస్తురాబాద్, సెప్టెంబరు 28 : భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ అన్నారు. శనివారం భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా బుట్టాపూర్ గ్రామంలోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారిపూ వీరోచితంగా పోరాడిన స్వాతంత్ర్య సమర యోధుడు భారత విప్లవకారుడు షాహిద్ భగత్ సింగ్ అని కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం 23 ఏళ్లకే ఉరికంబమెక్కిన ధైర్యశాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నిర్మల్ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు శైలేందర్, సీపీఎం పార్టీ నాయకులు మామిడి తిరుపతి, రాజేశ్వర్, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు నరేష్, గ్రామ అధ్యక్షుడు దుర్గం రవి, నాయకులు పాల్గొన్నారు.



కొత్త మాస్టర్ ప్లాన్ అమలుపై వెనకడుగు



నిర్మల్ పట్టణ మాస్టర్ ప్లాన్ చిత్రం ఇదే



జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఇదే



- రెండేళ్ల నుంచి దక్కని పరిష్కారం
- 220 జీఓతో కొంతమందికే ప్రయోజనం
- ఇండస్ట్రియల్ జోన్‌లోకి మంజులాపూర్, తల్వేద గ్రామాల భూములు
- ఇళ్ల నిర్మాణాలకు ఆటంకాలు
- జిల్లా ప్రజలకు సవరణపై సందేహాలు

నిర్మల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన నిర్మల్ మున్సిపాలిటీకి సంబంధించి రూపొందించిన కొత్త మాస్టర్‌ప్లాన్‌పై ఇప్పటి వరకు ముందడుగు పడడం లేదు. అప్పటి బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు 2022 సంవత్సరంలో ఆగమేఘాల మీద రూపొందింపజేసిన మాస్టర్‌ప్లాన్‌పై అంతటా వ్యతిరేకత ఎదురైన సంగతి తెలిసిందే. అప్పటి బీఆర్‌ఎస్ నేతలు కొంతమంది ఈ మాస్టర్‌ప్లాన్‌ను తమకు అనుకూలంగా తయారు చేయించుకున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఇండస్ట్రియల్ జోన్‌ల విషయంలో రైతుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. కాగా 1990 మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇండస్ట్రియల్ జోన్ సోఫీనగర్ ప్రాంతంలో కొనసాగుతోంది. అప్పటి నుంచి ఇటీవలి వరకు సోఫీనగర్ ప్రాంతమంతా ఇండస్ట్రియల్ జోన్‌లోనే కొనసాగుతోంది. అయితే 2022 సంవత్సరంలో రూపొందించిన కొత్త మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఇండస్ట్రియల్ జోన్‌ను సోఫీనగర్ ప్రాంతం నుంచి తరలించి పచ్చని పంట పొలాలున్న మంజులాపూర్, తల్వేద గ్రామాలను ఇండస్ట్రియల్ జోన్‌లోకి చేర్చారు. అయితే కొంతమంది అప్పటి ప్రజా ప్రతినిధులు ఈ మాస్టర్‌ప్లాన్‌ను తమకు అనుకూలంగా మలుచుకొని సోఫీనగర్ నుంచి ఇండస్ట్రియల్ జోన్‌ను పథకం ప్రకారం పంట పొలాలున్న గ్రామాలకు తరలించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై జిల్లావ్యాప్తంగా అప్పట్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టాయి. దీనికి తోడుగా రైతులు కూడా రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనలకు దిగి వచ్చిన అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త మాస్టర్‌ప్లాన్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. రైతులు, స్థానికుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి ఆ అభ్యంతరాలన్నింటిని పరిష్కరించిన అనంతరమే కొత్త మాస్టర్‌ప్లాన్‌ను రూపొందిస్తామంటూ మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు ప్రకటించారు. దీంతో రైతులు తమ ఆందోళనను తాత్కాలికంగా విరమించారు.

అనూహ్యంగా జీఓ నెంబర్ 220 జారీ

కొత్తగా రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించినప్పటి అప్పటి అధికారులు రైతులు, స్థానికులకు సంబంధం లేకుండానే జీఓ నంబర్ 220ని జారీ చేయడం వివాదానికి కారణమైంది. ఈ జీఓ ప్రకారం అప్పటికే రూపొందించిన మాస్టర్‌ప్లాన్‌ను ఫార్మల్ అప్రూవల్ (తాత్కాలికంగా) అమలు చేయాలని ఆ తరువాత రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి ఫైనల్ అప్రూవల్ చేయనున్నట్లు ఆ జీఓలో పేర్కొన్నారు. స్థానికుల నుంచి అభ్యంతరాలను స్వీకరించేందుకు గడువును కూడా విధించారు. ఈ గడువులోగా దాదాపు 400లకు పైగా అభ్యంతరాలు వచ్చాయి. అయితే ఆ అభ్యంతరాలన్నింటినీ ఆన్‌లైన్ చేసిన ఇక్కడి మున్సిపల్ అధికారులు రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌శాఖకు పంపించారు. ఈ వ్యవహారమంతా జరిపి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికి కొత్త మాస్టర్‌ప్లాన్ పూర్తి అప్రూవల్‌పై ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడం ఇక్కడి రైతులను ఆందోళనకు గురి చేస్తోంది.

మాస్టర్‌ప్లాన్ సవరణపై సందేహాలు

కాగా అప్పటి బీఆర్‌ఎస్ పార్టీ నేతల పలుకుబడితో రూపొందించిన జీఓ నంబర్ 220 కొంతమందికే ప్రయోజనం చేకూర్చిందన్న ఆరోపణలున్నాయి. ఈ జీఓ జారీతో కొన్ని ప్రాంతాలకు మాత్రమే ప్రయోజనం చేకూరింది. ఇండస్ట్రియల్ జోన్‌లో ఉన్న భూములు కమర్షియల్, రెసిడెన్షియల్ జోన్‌లోకి మారిపోయాయి. అయితే గ్రీన్‌జోన్‌లో ఉన్న గ్రామాలు మాత్రం ఇప్పటి కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇండస్ట్రియల్ జోన్‌లోనే ఉండడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. తమ నుంచి అభ్యంతరాలను స్వీకరించిన ఉన్నతాధికారులు ఇప్పటి వరకు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడం గాని కొత్త మాస్టర్ ప్లాన్‌ను సవరించడం గాని చేపట్టకపోవడంతో తమ భూములు గ్రీన్‌జోన్ అలాగే రెసిడెన్షియల్ జోన్ నుంచి తొలగిపోయి ఇండస్ట్రియల్ జోన్‌లోనే కొనసాగవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో తాము అందజేసిన అభ్యంతరాలను సీరియస్‌గా పరిశీలించి తమ గ్రామాలను కొత్త మాస్టర్‌ప్లాన్‌లో ఇండస్ట్రియల్ జోన్‌లో నుంచి తొలగించాలని కోరుతున్నారు.

బాసరలో భక్తులు

సమర్పించిన చీరలపై నిర్లక్ష్యం

- సరస్వతీ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను పట్టించుకోని ఆలయ సిబ్బంది
- జాగ్రత్తలు పాటించకుండా.. సమయానికి స్పందించకపోవడంతో నిరుపయోగంగా మారిన విలువైన వస్త్రాలు
- నిర్వాహణ అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



డార్మిటరీలోని ఒక హాలులో నిర్లక్ష్యంగా పారేసిన చీరలు

బాసర, సెప్టెంబరు, 28: బాసర సరస్వతి దేవస్థానంలో అధికారుల నిర్లక్ష్యం పరాకష్టకు చేరింది. భక్తుల సమస్యలనే కాదు వారు ఎంతో భక్తి ప్రపత్తులతో అమ్మవారికి సమర్పించిన కానుకలను పట్టించుకోకపోవడం లేదనే విమర్శలున్నాయి. ఇందుకు నిదర్శనమే అమ్మవారి చీరెల కానుకలను నిర్లక్ష్యంగా ఒక గదిలో వేయడం గదిలో పారేసి మరిచిపోవడంతో ఇప్పుడు అవి వినియోగించుకునే స్థితిలో లేకుండా పోయాయి. భక్తులు మొక్కులు మొక్కి సమర్పించిన చీరెలను దేవస్థాన డార్మేటరీ భవనంలోని ఒక పెద్ద హాల్‌లోఉంచారు. అంతకుముందు అవి వేరే గదిలో ఉండేవి. మరమ్మత్తుల కారణంగా కొన్ని రోజుల క్రిందట డార్మేటరీ భవనంలోకి చేర్చిన అధికార సిబ్బంది వాటిని నిర్లక్ష్యంగా వదిలేశారు. ప్రస్తుతం వాడుకోవడానికి వీలు లేకుండా అందులో చాలా చెడిపోయాయి. శుక్రవారం దేవస్థానంలో హౌస్ కీపింగ్ సిబ్బంది ఒకరు చీరెల గది వద్ద పనిచేస్తుండగా చీరెల కుప్ప నుండి పాము వచ్చి కాటేసింది. దీంతో అక్కడ అమ్మవారికి సమర్పించిన చీరెల కానుకలు అని వెలుగులోకి వచ్చింది. చీరెలను టెండర్ వేసి అమ్మేసినా, వరదముంపు ప్రాంతంలో నిరాశ్రయులైన బాధిత పేదలకు అందించినా ఉపయోగించుకునేవారని కొందరు భక్తులు స్థానికులు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నారు. ఈ విషయాన్ని ఆలయ ఈవో విజయ రామారావు దృష్టికి తీసుకెళ్లగా అవి తను బాసరకు రాక ముందు నుంచే ఉన్నవి అంటూ సమాధానమిచ్చారు.

ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాటానికి

మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు

దిలావర్‌పూర్, సెప్టెంబరు 28 : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, జడ్పీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దిలావర్‌పూర్‌లో 68 రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ... ఆగస్టు 5వ తేదీన ఇథనాల్ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు రావాల్సి ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను రావొద్దని చెప్పి ఆపేశానని అన్నారు. రైతుల ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని బదనాం చేసేందుకు కొంత మంది కుట్ర చేశారని మొదటి నుంచి ఉద్యమానికి దన్నుగా నిలబడింది మా కాంగ్రెస్ కార్యకర్తలేనని అన్నారు. తప్పకుండా మీ ఉద్యమానికి మా సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాగర్ రెడ్డి, సీనియర్ నాయకులు కే.రాజారెడ్డి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ మల్లు రవిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



డాక్టర్ మల్లు రవితో నాయకులు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 28 : నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవిని శనివారం కాంగ్రెస్ నాయకులు నిర్మల్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, నాందేడపు చిన్ను, తారక రఘువీర్, తదితరులున్నారు.

కోటి సీడ్‌బాల్స్ తయారు చేయడమే లక్ష్యం

వాసవీ క్లబ్ రీజనల్ ఛైర్‌పర్సన్ మహాజన్ జితేందర్



ఖానాపూర్‌లో విద్యార్థులు తయారు చేస్తున్న సీడ్ బాల్స్

ఖానాపూర్, సెప్టెంబరు 28 : రాబోయే తరానికి పచ్చదనాన్ని అందించేందుకు కోటి సీడ్ బాల్స్ తయారు చేయడమే లక్ష్యంగా వాసవీక్లబ్ కృషి చేస్తుందని వాసవీ క్లబ్ రీజనల్ ఛైర్ పర్సన్ మహాజన్ జితేందర్ అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్. రవిచంద్రన్ పిలుపు మేరకు శనివారం వాసవీవనిత క్లబ్, వాసవీక్లబ్‌ల ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో విద్యార్థులచే సీడ్ బాల్స్ తయారు చేయించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ... కోటి సీడ్ బాల్స్‌ని తయారు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చేరుతామన్నారు. ఈ తయారీలో జామ, చింత, సీతాఫలం, వేప, కానుగ తదితర సీడ్‌బాల్స్ 11 వేల వరకు తయారు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు చిటికేశి మానస, ప్రధాన కార్యదర్శి చిటికేశి స్రవంత్, కోశాధికారి ఎనగందుల వరలక్ష్మీ, ఉపాధ్యక్షులు చొల్లేటి శ్వేత, కార్యవర్గ సభ్యులు కూరగాయల రాధిక, చిన్నవార్ సరిత, ఖానాపూర్ వాసవీక్లబ్ అధ్యక్షులు విశ్వనాథుల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి చిటికేశి రవీందర్, కోశాధికారి చొల్లేటి సంతోష్, లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రిన్సిపాల్ పడాల ప్రభాకర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీలు

- సమస్యలు పరిష్కరించాలని ఆదేశం



వంటశాలలో సరుకు పరిశీలిస్తున్న ఛైర్ పర్సన్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఛైర్ పర్సన్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 28 : రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద జిల్లాలో శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. నిర్మల్ పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. తరగతి గదులు, వంటశాల, మరుగుదొడ్లు పరిశీలించారు. బియ్యం, కూరగాయల నాణ్యత పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అధ్యాపకుల కొరతతో పాటు పలు సమస్యలు విద్యార్థినులు చైర్మన్ దృష్టికి తెచ్చారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని డీఈవోను ఆదేశించారు. మహిళా కమిషన్ మహిళలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఏ సమస్యనైనా తనకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేయాల్సిన నెంబర్‌ను తరగతి బోర్డులపై రాయించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు.

విద్యార్థిని ఉచిత వైద్యానికి సహాయం

అస్వస్థతతో ఉన్న 9వ తరగతి విద్యార్థినికి వైద్య సహాయం అందించేందుకు ఛైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. స్థానిక న్యూరో హాస్పిటల్ వైద్యుడు నర్సింహారెడ్డిని విద్యార్థినికి వైద్య సహాయం అందించాలని కోరారు. విద్యార్థినిని పర్యవేక్షించాలని డీఈవో, ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు, కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన కలెక్టర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 28 : వరల్డ్ విజన్ ఇండియా ఎన్‌జీవో సంస్థ ఆధ్వర్యంలో పదోతరగతి చదివే విద్యార్థులకు కలెక్టర్ అభిలాష అభినవ్ స్టడీ మెటీరియల్ శనివారం అందజేశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లక్ష్మణచాంద ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాఘవేంద్ర పబ్లికేషన్ రూపొందించిన పుస్తకాలు అందజేశారు. ఎన్‌జీవో సంస్థను కలెక్టర్ అభినందించారు. ఎన్‌జీవో సంస్థలు ఇలాంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ముందుకు రావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్ ఉపయోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఎన్‌జీవో అధికారి వై. బ్రహ్మన్న, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్, డీఈవో రవీందర్‌రెడ్డి

ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పాటించండి

- ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్



కుభీర్, సెప్టెంబరు 28 : విద్యార్థులకు మెను ప్రకారం భోజనాలు అందించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి శంకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మరుగు దొడ్లను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. అక్కడి సిబ్బందితో మాట్లాడుతూ విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మెనూ ప్రకారం రుచికరమైన భోజనాలను అందించాలని సూచించారు. సందర్భంగా విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి నర్సయ్య తదితరులున్నారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న భైంసా రూరల్ సీఐ

కుభీర్, సెప్టెంబరు 28 : మండలంలోని ఓ తండాకు చెందిన వివాహితపై అత్యాచారానికి పాల్పడ్డ జాదవ్ సాహెబ్‌రావు అనే వ్యక్తిని శనివారం కుభీర్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా భైంసా రూరల్ సీఐ నైలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తి సాహెబ్‌రావు బాధితురాలిని గత ఆరు నెలల నుంచి వెంటపడి వేధిస్తున్నాడని తెలిపారు. ఈ విషయమై బాధితురాలు తన భర్తకు వివరించడంతో, ఇలా చేయడం సరికాదని సాహెబ్‌రావును మూడు నెలల క్రితం తన భర్త కుటుంబ సభ్యులు హెచ్చరించినా మార్పు రాలేదని ఈ నెల 26న మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయం చూసి ఆమెపై అత్యాచారం చేసి, తీవ్రంగా గాయపరిచాడని ఆమె మొబైల్ ఫోన్ తీసుకొని పరారయ్యాడని తెలిపారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు రెండు టీంలుగా ఏర్పడి నిందితుడిని రెండు రోజుల్లోనే పట్టుకున్నామన్నారు. అరెస్టు చేసినందుకు జిల్లా ఎస్పీ జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ అభినందించినట్లు తెలిపారు. నిందితుడిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని వివరించారు. ఆయన వెంట కుభీర్ ఎస్సై రవీందర్, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

న్యూ లోలంలో శతాధిక వృద్ధురాలి మృతి



ఆశాభి (106)

దిలావర్‌పూర్, సెప్టెంబరు 28 మండలంలోని న్యూ లోలంలో ఆశాబీ (106) అనే శతాధిక వృద్ధురాలు శనివారం మృతి చెందింది. న్యూ లోలం గ్రామంలో అత్యధిక వయస్సు కలిగిన ఆశాభికి నలుగురు కొడుకులు, ఒక కూతురు కాగా వారి సంతానం అందరూ కలిపి 96 మంది వరకు చేరింది. ఆశాభి మృతి చెందే వరకు తన పనులు తాను చేసుకునేదని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. కాగా గ్రామంలో అత్యంత పెద్ద వయస్సు రాలేన ఆశాభి మృతి పట్ల గ్రామస్తులు సంతాపం ప్రకటించారు.

రేపు కొబ్బరికాయల దుకాణం వేలం

దిలావర్‌పూర్, సెప్టెంబరు 28 : మండలంలోని సాంగ్వి లో వచ్చే నెల 5, 6వ తేదీల్లో నిర్వహించనున్న గంగనీళ్ల జాతరలో కొబ్బరికాయలు అమ్ముకునే దుకాణాన్ని సోమవారం వేలం వేయనున్నట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు సోమవారం జరిగే వేలం పాటలో పాల్గొనాలని వారు కోరారు.

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

నిర్మల్, సెప్టెంబరు 28 : హెచ్ఐవీ ఎయిడ్స్‌పై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని మండల విద్యాధికారి వెంకటేశ్వర్ అన్నారు. నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హెచ్ఐవీ సోకే మార్గాలు, నివారణ చర్యలపై వివరించారు.

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 28 : నిర్మల్ పట్టణం సాగర్ కాలనీలోని వృద్ధాశ్రమంలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా నిర్వహించే శిబిరంలో జిల్లా వైద్యాధికారి రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వయోవృద్ధులు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రతి గురువారం అన్ని ఆరోగ్య కేంద్రాల్లో వృద్ధులకు ప్రత్యేకసేవలు అందిస్తున్నామని వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 28 : ఖమ్మం జిల్లా వరద బాధితుల సహాయార్థం శనివారం తెలంగాణ రాష్ట్ర నిరుద్యోగ కళాకారుల సంఘం నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. వెంకటేష్, సాయిరాజ్, రాజేందర్, భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకున్న

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

దిలావర్‌పూర్, సెప్టెంబరు 28 : మండలంలోని గుండంపెల్లి గ్రామంలో ఇంకుడు గుంతలు నిర్మించుకున్న 11 మంది లబ్ధిదారులకు శనివారం ఎంపీవో గోవర్ధన్ చెక్కులు అందజేశారు. ఒక్కొక్కరికి రూ. 4,808ల చొప్పున మొత్తం రూ. 52,888లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో మాట్లాడుతూ... ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలన్నారు. వర్షం నీరు, మనం వాడుకున్న నీరు వృధా కాకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి వెళ్లి భూగర్భ జలాలు పెరిగేందుకు ఉపయోగపడతాయన్నారు.